

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం: భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం కృష్ణాజిల్లాకు చెందిన జి.ఏడుకొండలు రూ1,01,116 విరాళంగా అందజేశారు.



నందీశ్వరుడికి పూజలు

శ్రీశైలం: ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరుడికి సోమవారం పూజలు నిర్వహించారు.అంతకు ముందు వెండి రథంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించి ఆలయ ప్రదక్షిణ చేశారు.



యోగా చాంపియన్ కర్నూలు

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి యోగా లీగ్ పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. కర్నూలు జట్టు 105, అనంతపురం జట్టు 95, నంద్యాల జట్టు 92 పాయింట్లు సాధించాయి.

న్యూస్‌రీల్

కేసీ కాల్వలో తగ్గిన నీటి ప్రవాహం

జూపాడుబంగ్లా: కర్నూలు–కడప కాల్వకు రావాల్సిన నీటి వాటాలో 2 టీఎంసీల నీటి విడుదల కోసం పెట్టిన ఇండెంట్ ముగియటంతో కేసీ కాల్వలో సాగు నీటి సరఫరా తగ్గిపోయింది. కేసీ కాల్వ నీటి వాటాగా తుంగభద్ర డ్యాంలోంచి 7 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా అందులో 2 టీఎంసీల నీటి విడుదలకు పదిరోజుల క్రితం ఇండెంట్ పెట్టడంతో తుంగభద్ర డ్యాం నుంచి కేసీ కాల్వకు నీటిని సరఫరా చేశారు. ఇండెంట్ ముగియటంతో కేసీ కాల్వకు సాగునీటి సరఫరా నిలిచిపోయింది. సోమవారం సాయంత్రం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ఓ పంపు ద్వారా 250 క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వకు సరఫరా చేస్తున్నారు. మరో పంపును ఆన్ చేసి మరో 250 క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వకు సరఫరా చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కేసీ వాటాగా మిగిలిన 5 టీఎంసీల నీటి కోసం అధికారులు ఇండెంట్ పెట్టలేదని తెలుస్తోంది. మిగిలిన నీటి వాటాను రబీ పంటలు చేతికందే వరకు సద్వినియోగం అయ్యేలా చేయాలని కేసీ కాల్వ ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ప్రాక్టికల్ పరీక్షలకు 122 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 122 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వృత్తి విద్యాధికారి సునిత తెలిపారు. ఉదయం సెషన్స్‌లో జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకు 1,934 మందికి 1,840 మంది హాజరు కాగా 94 మంది, మధ్యాహ్నం సెషన్స్‌లో 1,317 మందికి గానూ 1,289 మంది హాజరు కాగా 28 మంది గైర్హాజరైనట్లు డీవీఈఓ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


సాయిబాబా మకర తోరణానికి రూ.10 లక్షల విరాళం



దాత కవికొండల కిషన్ (ఫైల్)

డోన్ టౌన్: పట్టణ సమీపంలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయంలో బాబా విగ్రహం చుట్టూ ఉండే వెండి మకర తోరణానికి యుఎస్ఏలోని మిచ్చిగాన్ రాష్ట్రం ఎస్కే ఇంటర్నేషనల్ గ్రూపు సీఈఓ (ఎన్ఆర్ఐ) కవికొండల కిషన్ రూ.10 లక్షల విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. గుడి ప్రారంభోత్సవం అంకురార్పణ పూజలు, ఈనెల 13న బాబా విగ్రహ ప్రతిష్ట తదితర వాటిని సోషల్ మీడియాలో చూసి బాబాపై ఉన్న నమ్మకం, భక్తితో కమిటీలో ఒక్కరైన రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మారం సుబ్బారెడ్డితో ఫోన్‌లో సంప్రదించి తన విరాళం అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

జాతీయ అథ్లెటిక్స్‌కు సంజామల పీఈటీ



పీఈటీ బాషాను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంజామల: స్థానిక ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 8, 9 తేదీలలో అనంతపురంలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో హైజంప్‌లో గోల్డ్, షాట్‌పుట్‌లో సిల్వర్, జావలిన్ త్రోలో బ్రాంజ్ మెడల్స్ సాధించారు. సోమవారం పాఠశాలలో ఆయనను హెచ్ఎం సురేష్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. త్వరలో జరిగే కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జరిగే జాతీయ స్థాయిలో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి 10 కేటగిరీల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు గతేడాది జనవరి 29వ తేదీన జారీ చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల రివైజ్డ్ ప్రొవిజనల్ మెరిట్ లిస్టును విడుదల చేశామని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్‌లు https://kurnool.gov.in, https://nandyal.ap.gov.in, https://kurnoolmedicalcollege.ac.inలలో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు వారి వివరాలను సరిచూసుకుని ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11వ తేది నుంచి 15వ తేది సాయంత్రం 5 గంటల్లోపు కళాశాలలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా సమర్పించాలన్నారు.

దయనీయం



ఈ చిత్రంలోని మహిళ పేరు శంకరమ్మ. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్‌పల్లి గ్రామానికి చెందిన ఈమె భర్త రామచంద్రుడు (45) అనారోగ్యంతో 45 రోజుల క్రితం మృతి చెందాడు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మృతిచెందడంతో శంకరమ్మకు రూ.5 లక్షల పరిహారం రావాల్సి ఉంది. అయితే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్ బీమాను చంద్రన్న బీమాగా పేరు మార్చింది తప్ప ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదు. గ్రామ సచివాలయంలో అడిగితే సైట్ క్లోజ్ అయిందని, రిజిస్ట్రేషన్లు చేయడం లేదని చెప్పారు. ప్రభుత్వం నుంచి చేయూత లేకపోవడంతో శంకరమ్మ పరిస్థితి దయనీయంగా మారింది.



చంద్రన్న బీమాకు గ్రహణం

- కూటమి ప్రభుత్వం ఏర్పాటై 8 నెలలు అవుతున్నా అమలు శూన్యం
- ఆన్‌లైన్‌లో క్లోజ్ అయిన చంద్రన్నబీమా సైట్
- వేల కుటుంబాలకు అందని పరిహారం
- హామీ అమలులో దారుణ విఫలం
- కష్టాల్లో పేదలు, మధ్య తరగతి ప్రజలు

కర్నూలు(అగ్రికల్చర్): చంద్రన్న బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం పక్కన పెట్టింది. ఈ పథకం కింద రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాకపోయినా పట్టించుకోవడం లేదు. ఇంటి పెద్దను కోల్పోయి వేలాది సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు దుఃఖంలో ఉన్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడంలేదు. కనీసం పరిహారం అందించి దయ, సానుభూతి కూడా చూపడం లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని పాలకులు పూర్తిగా పక్కనపెట్టడంపై విమర్శలు వస్తున్నాయి. ఇంటికి ఆధారమైన వ్యక్తి మృతి చెందినప్పుడు ఆ కుటుంబం వీధిన పడరాదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ బీమా అమలు చేసింది. రైస్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి రూపాయి ఖర్చు లేకుండా బీమా కల్పించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే వైఎస్ఆర్ బీమా పథకాన్ని చంద్రన్న బీమాగా మార్చింది. అయితే కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మృతి చెందితే పరిహారం ఇవ్వడాన్ని మరచింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేలాది మంది మృతి చెందినా ఒక్క కుటుంబానికి కూడా బీమా లభించలేదు.

ఇదీ దుస్థితి..

ప్రమాదవశాత్తు ఇంటి పెద్ద మృతిచెందితే ఆ కుటుంబానికి రూ.10 లక్షలు, సహజంగా మృతి చెందితే రూ.5 లక్షలకు బీమా సదుపాయం కల్పిస్తామని 2024 ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 8వ నెల నడుస్తున్నా హామీ అమలుపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. చంద్రన్న బీమా సైట్ ఓపెన్ కాకపోవడంతో మరణించిన వారి, వారసుల వివరాలను నమోదు చేసే అవకాశమే లేకుండా పోయింది. ఇచ్చిన హామీ ప్రకారం కుటుంబానికి ఆధారమైన 18–50 ఏళ్లలోపు పాలసీదారులు సాధారణంగా మరణిస్తే చంద్రన్న బీమా కింద రూ.5 లక్షలు, 18–70 ఏళ్ల లోపు పాలసీదారులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు పరిహారం లభిస్తుంది. జూన్ నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 18 నుంచి 50 ఏళ్లలోపు వారు 10 వేల మందికిపైగా మృతిచెందారు. ప్రమాదవశాత్తు 1,500కిపైగా మృతిచెందారు. 80 శాతం మృతుల కుటుంబాలకు బీమా అర్హత ఉన్నా పరిహారం అందలేదు. నిబంధనల ప్రకారం బీమా ఉన్న వ్యక్తి మృతి చెందితే 24 గంటల్లో రూ.10 వేలు చెల్లించాల్సి ఉంది. అయితే చంద్రన్న బీమా సైట్ క్లోజ్ కావడంతో మృతిచెందిన వారి కుటుంబాలకు ఊరట దక్కడం లేదు.

టీడీపీ కార్యకర్తలకు పెద్దపీట

సామాన్య, మధ్యతరగతి కుటుంబాలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పెద్దపీట వేస్తోంది. కోటి మందికిపైగా టీడీపీ సభ్యత్వం కల్పించడంతో పాటు రూ.5 లక్షలకు ప్రమాద బీమా కూడా కల్పించింది. టీడీపీ కార్యకర్తలకు ఇచ్చిన విలువ సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఇవ్వకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. తమకు పార్టీ కార్యకర్తలే ముఖ్యం.. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కాదని టీడీపీ నిరూపించుకున్నట్లు అయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ధీమా కరువై!



ఈ చిత్రంలో భార్యా పిల్లలతో కనిపించే వ్యక్తిపేరు ఎల్లక్రిష్ణ (ఏసు). మండల కేంద్రమైన వెల్దుర్తి గ్రామానికి చెందిన ఈయన 2024న మే నెలలో అనారోగ్య కారణాలతో మరణించారు. ఇతని భార్య సుజాత, నలుగురు పిల్లలను ప్రభుత్వం ఆదుకోలేదు. చంద్రన్న బీమా సాయం ఊసే లేకుండా పోయింది. కనీసం రిజిస్ట్రేషన్ చేయించడానికి ప్రయత్నిస్తే సైట్ క్లోజ్ అయిందని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ నిరుపేద కుటుంబానికి ఎలాంటి భూమి లేదు. ఎనిమిది నెలలు గడిచినా బీమా ఊసే లేకపోవడంతో ఆ కుటుంబం ఆందోళన చెందుతోంది.

నాటి పరిస్థితులే పునరావృతం

2014–15 నుంచి 2018–19 మధ్య ఉన్న పరిస్థితులే మళ్లీ పునరావృతం అవుతున్నాయి. నాటి టీడీపీ పాలనలో చంద్రన్న బీమా ఉన్న వారు వేలాది మంది అసువులు బాసినప్పటికీ నాటిప్రభుత్వం నుంచి లభించిన భరోసా నామ మాత్రమే. బీమా ఉన్న వారు మృతిచెందితే వారి వారసులు పరిహారం పొందాలంటే ఏళ్లు గడిచేవి. భరోసా లభించక బాధిత కుటుంబాల సభ్యులు అనేక ఇబ్బందులు పడేవారు. నాటి ఐదేళ్లలో మృతిచెందిన వారి కుటుంబాల్లో 50 శాతం మందికి కూడా బీమా దక్కలేదు. ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమా అమలులో తీవ్ర జాప్యం చేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12.38 లక్షల రైస్‌కార్డులు ఉండగా...10.25 లక్షల కటుంబాలకు గత ప్రభుత్వం వైఎస్ఆర్ బీమా కల్పించింది. కూటమి ప్రభుత్వం మాత్రం చంద్రన్న బీమాను ఇంతవరకు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

నిరాశే మిగిలింది

ఎన్నికల కోడ్ 2024 మార్చి నెల 18 నుంచి వచ్చింది. నాటి నుంచి వైఎస్ఆర్ బీమా కింద రిజిస్ట్రేషన్‌లు, డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయడం ఆగిపోయింది. జూన్ 12 నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. వెంటనే వైఎస్ఆర్ బీమాను చంద్రన్న బీమాగా పేరు మార్చినప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలులో వేగం లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రమాద మరణాలకు రూ.10 లక్షలు, సహజ మరణాలకు రూ.5 లక్షలు పెంచుతూ ఉత్తర్వులు కూడా ఇవ్వలేదు. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల్లో నిరాశే మిగిలింది.

సున్నిపెంట కబ్జాలపై కలెక్టర్ సీరియస్



ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట నుంచి భూకబ్జాలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. వన్ మార్నింగ్ కబ్జాలను కూలగొట్టడం ఖాయమని వార్నింగ్ ఇచ్చారు. సున్నిపెంట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదికలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వినతలు స్వీకరించారు. తమ స్థలంలోకి ఇతరులు దౌర్జన్యంగా వచ్చి, తమ గోడను పగులగొట్టి కొంత స్థలాన్ని ఆక్రమించారని ఓ మహిళ ఫిర్యాదు చేయగా కలెక్టర్ స్పందించి ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు బాలూనాయక్, సాయినాయక్‌లతో చర్చించారు. సున్నిపెంటలో ప్రభుత్వ స్థలాల కబ్జాలు విపరీతంగా పెరిగిపోతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సున్నిపెంటలో గృహాలు, ప్రైవేటు కట్టడాలు, స్థలాలు ఆక్రమణ, వ్యాపార దుకాణాలు, లాడ్జీలు, హోటళ్ల వాటి అనుమతులు వంటి వాటి వివరాలు పూర్తిస్థాయిలో సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 4 రోజుల్లో సమగ్ర నివేదిక అందిస్తామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే విద్యుత్ మీటర్లకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని, ఫైర్ స్టేషన్‌ను తరలించరాదని అధికారులకు స్థానికులు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం గిరిజన లబ్ధిదారులకు మెకానికల్ కిట్లను అందజేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఆర్‌డీఓ నాగజ్యోతి, ఐటీడీఏ పీఓ వెంకట శివప్రసాద్, ఏపీఓ సురేష్‌కుమార్, డీఎస్పీ రామాంజినాయక్, డీపీఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నమో నారసింహ!



చింతకుంటలో ఊరేగుతున్న ఉత్సవ పల్లకీ

ఆళ్లగడ్డ: గ్రామ గ్రామానా విశేష పూజలందుకుంటూ ఊరేగుతున్న జ్వాల నరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వాముల ఉత్సవ పల్లకీ సోమవారం చింతకుంటలో కొలువుదీరింది. ఉయ్యాలవాడ మండలం సర్వాయిప ల్లె నుంచి తెల్లవారుజామున ఎంవీ నగర్‌కు చేరుకుంది. అక్కడ ఎంపీడీఓ, డీఎస్పీ, పోలీస్ సర్కిల్ కార్యాలయాల్లో విశేష పూజలు అందుకున్న అనంతరం చింతకుంట గ్రామ పొలిమేరకు చేరుకున్న ఉత్సవమూర్తులకు సంప్రదాయం ప్రకారం వీఆర్వో బారెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రజలతో కలిసి స్వాగతం పలికారు. అనంతరం పల్లకీని మొదటి తెలుపుపై కొలువుంచగా గ్రామస్తులు బారులు దీరి దర్శించుకున్నారు. అనంతరం ఒక తెలుపు నుంచి మరో తెలుపుపైకి గ్రామస్తులు భుజాలపై మోసుకుంటూ నడిచారు. ప్రధాన వీధుల్లో బొమ్మలు, గాజుల అంగళ్లు, రంగుల రాటాలు ఏర్పాటు చేయడంతో తిరునాల వాతావరణం నెలకొంది.

సామాన్య భక్తుల దర్శనానికి ప్రాధాన్యం

- శ్రీశైలంలో ప్రతిష్టాత్మకంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు
- దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, చిత్రంలో మంత్రులు, అధికారి

శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో ఈ నెల 19 నుంచి 11 రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. సామాన్య భక్తుల దర్శనానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దేవస్థాన కమాండ్ కంట్రోల్ రూంలో హోంశాఖ మంత్రి వి.అనిత, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్, దేవదాయ సీఎఫ్ఓ. ఎస్.చంద్రశేఖర్ ఆజాద్, ఈ.ఓ. శ్రీనివాసరావు, ఫారెస్ట్ డీఎఫ్ఓ తదితరులు జిల్లా వ్యాప్తంగా అన్ని విభాగాల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. లక్షల సంఖ్యలో శివస్వాములు, భక్తులు కాలినడకన నల్లమల అటవీమార్గాన శ్రీశైలం చేరుకుంటారని, వారికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్సవాల్లో ఎలాంటి తొక్కిసలాటలు జరుగకుండా పటిష్ట ప్రణాళికను రూపొందించి అమలు చేయాలన్నారు. ఆలయ సమీప ప్రాంత రోడ్ల వద్దకు, సత్రాల వద్దకు చేరుకొనేలా ఉచితంగా మినీ వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. మహాశివరాత్రిలో ముఖ్య పర్వదినాలైన 24, 25, 26, 27 తేదీల్లో క్యూల్లో ఉన్న భక్తులకు చిన్న ఉచిత లడ్డూను ప్రసాదంగా అందజేయాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఆరు డ్రోన్ కెమెరాలను దేవదాయశాఖ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. పాదయాత్రన వచ్చే భక్తులకు చెంచుగూడేల్లో మంచినీరు, బిస్కెట్లు అందించాలని, ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఫారెస్టు అధికారులకు సూచించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మల్లన్న దర్శనానికి వచ్చే వీవీఐపీ, వీఐపీలకు ప్రత్యేకంగా రెండు స్లాట్లను ఏర్పాటు చేయాల్సిందిగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చేసిన సూచన ఆహ్వానించదగ్గదేనని మంత్రులు అన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంత్రులకు దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు వివరించారు.

జిల్లాలో 97.22 శాతం మాత్రల పంపిణీ

గోస్పాడు: జిల్లాలో జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం 97.22 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ పూర్తి చేసినట్లు డీఎంహెచ్ఓ వెంకటరమణ తెలిపారు. వైద్య అధికారులు, సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో జిల్లాలో 211 కళాశాలలు, 1,663 అంగన్‌వాడీ కేంద్రాలు, 1,597 పాఠశాలల్లో ఉన్న 4,29,268 మంది విద్యార్థులకు గానూ 4,17,341 మందికి మాత్రలను అందజేశామన్నారు. మిగిలిన వారికి ఈనెల 17వ తేదీన జరిగే మ్యాప్ అఫ్ డే రోజున సిబ్బంది మాత్రలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి కాంతారావు నాయక్ పాల్గొన్నారు.

45 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి

కర్నూలు (సెంట్రల్): రెవెన్యూ శాఖలో సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, గ్రేడ్1 వీఆర్వోలకు ఎట్టకేలకు పదోన్నతి కల్పిస్తూ కలెక్టర్ పి.రంజిత్ బాషా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 45 మందికి పదోన్నతి కల్పించగా అందులో 20 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు టైపిస్టులు, 23 మంది గ్రేడ్–1 వీఆర్ఓలు ఉన్నారు. వీరిలో 20 మందిని నంద్యాల జిల్లాకు, 25 మందికి కర్నూలు జిల్లాకు కేటాయించారు. త్వరలోనే వారికి స్థానాలను కేటాయించేందుకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

‘తమ్ముళ్ల’కు కిక్కే కిక్కు!

- ప్రైవేటు మాఫియాగా మారిన వారికి మరిన్ని మద్యం దుకాణాలు
- రెండో విడత కేటాయింపులో చక్రం తిప్పిన టీడీపీ నాయకులు
- ఆదాయం కోసం దుకాణాలను పెంచిన కూటమి ప్రభుత్వం



కేటాయించిన మద్యం దుకాణాల వివరాలు చూపుతున్న ఎక్సైజ్ అధికారి

కర్నూలు/బొమ్మలసత్రం: మద్యం సిండికేట్‌లో తెలుగు తమ్ముళ్లు(టీడీపీ నాయకులు, కార్యకర్తలు) కీలకంగా వ్యవహరిస్తున్నారు. రెండో విడత వీరికే ఎక్కువగా మద్యం దుకాణాలు దక్కాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గీత ఉప కులాలకు కేటాయించిన 21 మద్యం దుకాణాల లైసెన్స్‌దారుల ఎంపిక కర్నూలు జిల్లాపరిషత్ సమావేశ భవనంలో నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, సూపరింటెండెంట్ సుధీర్ బాబు, నంద్యాలలో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, డీఆర్వో రామ్‌నాయక్, ఈఎస్ రవికుమార్‌ల ఆధ్వర్యంలో లక్కీడిప్ (లాటరీ ప్రక్రియ) జరిగింది. 21 మద్యం దుకాణాలకు 234 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల సమక్షంలోనే లక్కీడిప్ నిర్వహించి లైసెన్స్‌దారులను ఎంపిక చేశారు. ఎక్సైజ్ పాలసీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గీత కులాలకు రిజర్వేషన్ల ప్రాతిపదికన 2024–25 సంవత్సరాలకు మద్యం దుకాణాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఉమ్మడి జిల్లాలో లక్కీడిప్ ద్వారా లైసెన్స్‌దారులను ఎంపిక చేసి ప్రొవిజనల్ సర్టిఫికెట్లను జారీ చేశారు.

రెండు దుకాణాలు మహిళలకు..

ఉమ్మడి జిల్లాలో గీత ఉప కులాలకు కేటాయించిన 21 దుకాణాలకు గాను 11 మంది మహిళలు దరఖాస్తు చేసుకోగా ఇద్దరికి లక్కీడిప్‌లో దుకాణాలు దక్కాయి. నంద్యాల జిల్లాలో కొత్తపల్లి దుకాణం అగశాల పల్లవి, కర్నూలు జిల్లాలో కోసిగి దుకాణం ఈడిగ సుజాత దక్కించుకున్నారు.

ప్రభుత్వానికి భారీగా ఆదాయం..

ఎక్సైజ్ టెండర్ల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దరఖాస్తుల ద్వారా రూ.4.68 కోట్లు మొదటి విడత లైసెన్స్ రుసుం కింద రూ.87.66 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. రెండు జిల్లాల్లోనూ 21 మద్యం దుకాణాలకు గెజిట్ నంబర్ ప్రకారం క్రమ సంఖ్య ఆధారంగా స్టీల్ బాక్సులో ప్లాస్టిక్ కాయిన్లు వేసి లక్కీడిప్ తీశారు. మొదట మున్సిపల్ పట్టణ ప్రాంతాలు, ఆ తర్వాత సర్కిళ్ల వారీగా మండల కేంద్రాల్లోని దుకాణాలకు లాటరీ నిర్వహించారు. ఎంపికైన మొదటి వ్యక్తి వెంటనే లైసెన్స్ ఫీజు చెల్లించి దుకాణాన్ని దక్కించుకున్నారు. దుకాణాల కేటాయింపును వీడియో, కెమెరాలతో చిత్రీకరించారు.

2014–19 పరిస్థితులు పునరావృతం

2014–19 మధ్యకాలంలో టీడీపీ మద్యం పాలసీ పేరుతో భారీగా వ్యాపారం చేసింది. వారు నిర్ణయించిన ధరకే మందుబాబులు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. చెప్పాలంటే మద్యం వ్యాపారం ఓ మాఫియాలా జరిగేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రైవేటు మాఫియాకు తావు లేకుండా ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడిపింది. కొంతమందికి ఉపాధి కల్పించింది. వారి ద్వారా నిర్దేశిత సమయాల్లో విక్రయాలు జరిపించింది. మద్యం ఏరులా ప్రవహించకూడదని పరిమిత షాపులు పెట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో 175 మద్యం దుకాణాలు ఉండగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆదాయమే లక్ష్యంగా మొదటి విడత 204, రెండవ విడత గీత ఉప కులాల పేరుతో మరో 21 దుకాణాలు కలిపి మొత్తం 225 దుకాణాలకు అనుమతులు జారీ చేశారు.

టీడీపీ నాయకుల ‘మద్య’ విభేదాలు

డోన్: గౌడ్ కులస్తులకు మద్యం దుకాణాల కేటాయింపు కోసం సోమవారం నంద్యాలలో నిర్వహించిన టెండర్ పక్రియ డోన్‌లోని టీడీపీ వర్గీయుల మధ్య చిచ్చురేపింది. డోన్‌లోని గౌడ్ కులస్తులకు గ్రామీణ ప్రాంతంలో ఒకటి, పట్టణ ప్రాంతంలో ఒక్కటి చొప్పున మద్యం దుకాణాలు కేటాయించారు. గతంలో డోన్ మండలానికి ఆరు దుకాణాలు కేటాయించగా పట్టణంలో నాలుగు ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి వర్గానికి దక్కాయి. గ్రామీణ ప్రాంతంలో రెండు దుకాణాలు అదే పార్టీకి చెందిన రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మారం సుబ్బారెడ్డి వర్గీయులకు దక్కాయి. సుబ్బారెడ్డి వర్గీయుల మద్యం వ్యాపారాలను దెబ్బ తీసేందుకు కోట్ల వర్గీయులు బెల్టు షాపుల ఏర్పాటును ప్రోత్సహించారు. దీంతో ఆగ్రహించిన సుబ్బారెడ్డి వర్గీయులైన గౌడ్ కులస్తులు.. నంద్యాల్లో జరిగిన లాటరీ పద్ధతిలో డిపాజిట్ చెల్లించి డోన్ పట్టణంలోని దుకాణాన్ని కై వసం చేసుకున్నారు. దీంతో కోట్ల వర్గీయుడైన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కేశన్న గౌడ్ సోమవారం రాత్రి వాట్సాప్‌లో పరోక్షంగా సుబ్బారెడ్డిని ఉద్దేశించి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. గౌడ్ కులస్తులకు దక్కాల్సిన మద్యం షాపుల బినామీ పేర్లతో దక్కించుకోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదం ఎక్కడి వరకు దారి తీస్తోందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సేవ చెయ్యడంలో శ్రద్ధ చూపకుండా అక్రమ సంపాదన కోసం ఆరులు చాస్తున్న టీడీపీ నాయకుల వైఖరిని చూసి ప్రజలు విస్తుపోతున్నారు.

క్లుప్తంగా

14 వరకు రాజపురస్కార్ టెస్టింగ్ క్యాంప్



జ్యోతి ప్రజ్వల చేస్తున్న రూరల్ సీఐ మధుసుదన్‌రావు, ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ నెల 14 వ తేది వరకు రాజపురస్కార్ టెస్టింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి తెలిపారు. సోమవారం ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రూరల్ సీఐ మధుసూదన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ క్యాంప్‌నకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి 16 నవోదయ విద్యాలయాల భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ హాజరయ్యారని చెప్పారు. ఈ క్యాంప్ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యంతో పాటు సేవా తత్వం పెంచుతుందన్నారు. నవోదయ విద్యాలయాల విద్యార్థులంటే క్రమశిక్షణకు మారుపేరని సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, వెంకటేష్, ఎల్‌టీసీ స్కౌట్స్ బాబురావు నింబూరె, ఎల్‌టీసీ గైడ్స్ మల్లేశ్వరి, శిక్షణ పరిశీలకులు అనిల్ శాస్త్రి, రమేష్, శివకుమార్, విద్యాలయ స్కౌట్స్, గైడ్స్ మాస్టర్లు శశికిరణ్, మీనాచంద్రన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొలం విషయంలో ఘర్షణ

- ఒకరికి రక్త గాయాలు



గాయపడిన నారాయణ

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో పొలం విషయంలో జరిగిన ఘర్షణలో ఒకరికి రక్త గాయాలయ్యాయి. ఏఎస్ఐ రంగయ్య తెలిపిన వివరాలు.. అన్నదమ్ములు చాకలి నారాయణ, పెద్ద నరసింహుల మధ్య 2.20 ఎకరాల పొలానికి సంబంధించి తమదంటే తమదంటూ కొంత కాలంగా గొడవ పడుతూనే ఉన్నారు. ఇదే విషయమై నారాయణ కోర్టును ఆశ్రయించి పెద్ద నరసింహులుకు కోర్టు నోటీసులు పంపించాడు. దీంతో కోపోద్రిక్తులైన పెద్ద నరసింహుడి కుమారుడు బాలనరసింహులు సోమవారం చాకిరేవుకు వెళ్తున్న బాబాయ్‌పై రాళ్లతో దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ తెలిపారు.

దర్శనం.. అద్వితీయం

- ఏడాదిలో రెండు రోజులు మాత్రమే దేవాలయ దర్శనం
- శివరాత్రి వచ్చేంతవరకు వేచి ఉండాల్సిందే
- అటవీశాఖ అధికారుల అనుమతి తప్పనిసరి
- మహిమాన్విత క్షేత్రం.. గుండ్ల బ్రహ్మేశ్వరం



రాజరాజేశ్వరిదేవి అమ్మవారు





గుండ్ల బ్రహ్మేశ్వర ఆలయం (ఇన్‌సెట్) శ్రీ గుండ్ల బ్రహ్మేశ్వరస్వామి

ఆత్మకూరు: ప్రముఖ శైవక్షేత్రాల్లో బండిఆత్మకూరు మండల పరిధిలోని నల్లమల అడవిలో వెలసిన గుండ్ల బ్రహ్మేశ్వర క్షేత్రం ప్రసిద్ధి చెందింది. కాకతీయ, విజయనగర సామ్రాజ్య కాలంలో ఈ ఆలయాన్ని పునఃనిర్మించినట్లు శిలాశాసనాలు చెబుతున్నాయి. దక్షిణ భారత నిర్మాణశైలిని ఆలయంలో గమనించవచ్చు. ఈ క్షేత్రాన్ని చూడాలంటే ఏడాదికి రెండు రోజులు మాత్రమే అవకాశం ఉంది. శివరాత్రి వరకు ఈ క్షేత్రానికి వచ్చే పరిస్థితి లేదు. ఆలయంలో మహాశివుడే బ్రహ్మేశ్వరుడి రూపంలో కొలువై ఉన్నారు. ద్వాపరయుగంలో మహాభారత కురుక్షేత్ర సంగ్రామం అనంతరం అశ్వత్థామ.. శ్రీకృష్ణుడి ఆదేశానుసారంతో గుండ్లకమ్మ నది జన్మస్థానతీరాన శివలింగాన్ని ప్రతిష్ఠించాడని భక్తుల నమ్మకం. ఆలయంలో గుండ్లబ్రహ్మేశ్వరస్వామితో పాటు రాజరాజేశ్వరిదేవి, అశ్వత్థామ, వీరభద్రస్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహాలు కొలువై ఉన్నాయి. శివరాత్రి మినహా మరొకరోజు మాత్రమే ఆలయాన్ని దర్శించుకునేందుకు అటవీశాఖ అధికారులు అనుమతిస్తారు.

ప్రకృతి రమణీయత..

గుండ్ల బ్రహ్మేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఎన్నో వృక్షాలు, జంతువులు కనిపిస్తాయి. ఈ ప్రాంతంలో 353 వృక్షజాతులు ఉన్నాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో పులులు, మచ్చలపిల్లి, ఉడతలు తదితర జంతువులు, దుప్పులను చూడవచ్చు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 23 పులులు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. దేవాలయం సమీపంలో గుండ్లకమ్మ నది నంద్యాల, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాలో ప్రవహిస్తుంది. ఈ నదిపై కందుల ఓబుళరెడ్డి గుండ్లకమ్మ జలాశయాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ జలాశయంతో ప్రకాశం జిల్లా పరిధిలో అనేక గ్రామాలకు తాగు, సాగునీరు అందుతోంది.

ఇలా చేరుకోవచ్చు..

వెలుగోడు మీదుగా గట్టుతండా నుంచి నేరుగా ఈ క్షేత్రాన్ని ట్రాక్టర్లు, వివిధ వాహనాల ద్వారా చేరుకోవచ్చు. గతంలో ఆర్టీసీ బస్సులు, అన్ని వాహనాల్లో ఈ క్షేత్రానికి వెళ్లేవారు. తెలుగుగంగ రిజర్వాయర్‌ను నిర్మించడం, పులుల సంరక్షణ కేంద్రంగా ఈ క్షేత్రాన్ని అటవీశాఖ అధికారులు గుర్తించి.. ఈ రహదారిని మూసి వేశారు. ఈ రహదారిని ఈ యేడాది మహాశివరాత్రి సందర్భంగా అనుమతించాలని అటవీశాఖ అధికారులకు భక్తులు విన్నవించారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దృష్టికి కూడా భక్తులు తీసుకెళ్లారు. ప్రస్తుతం నంద్యాల, వెలుగోడు, ఆత్మకూరు నుంచి సంతజూటూరు గ్రామం నుంచి పెద్దదేవలాపురం గ్రామం మీదుగా ఈ క్షేత్రానికి వెళ్లవచ్చు. నంద్యాల నుంచి గాజులపల్లె మీదుగా గిద్దలూరు సమీపంలోని దిగువమెట్ట వద్ద దిగి నేరుగా ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు. నంద్యాల నుంచి దిగువమెట్ట మీదుగా గుండ్ల బ్రహ్మేశ్వరానికి అన్నిరకాల వాహనాలు వెళ్తాయి. దూరం 42 కి.మీ ఉంటుంది. ఈ క్షేత్రానికి చేరాలంటే అటవీశాఖ అధికారులు అనుమతి తీసుకోవాలి. వారు కొన్ని వాహనాలకు మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. వాహనాలు ఉదయం 6 గంటలకు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు తిరిగి రావాల్సి ఉంటుంది.

ప్రతి ఒక్కరూ సందర్శించాలి

నల్లమల అటవీ పరిధిలోని గుండ్ల బ్రహ్మేశ్వర క్షేత్రాన్ని ప్రతి ఒక్కరూ సందర్శించాల్సిందే. ఈ క్షేత్రంలో వెలిసిన రాజరాజేశ్వరిమాతను పూజించాలి. ఈ క్షేత్రానికి ఒకప్పుడు వెలుగోడు, సంతజూటూరు, గిద్దలూరు మీదుగా వేలాది మంది భక్తులు కార్తీకమాసం, మాఘమాసం, మహాశివరాత్రి పర్వదినాల్లో వెళ్లేవారు. అయితే శ్రీశైలం, నాగార్జునసాగర్ పులుల సంరక్షణ కేంద్రంగా ఏర్పాటు చేయడంతో మహాశివరాత్రి సందర్భంగా రెండు రోజులు మాత్రమే అనుమతిస్తున్నారు. దేవాలయం అభివృద్ధి చెందాలంటే భక్తులను అనుమతించాలి. ఇక్కడ గుండ్ల బ్రహ్మేశ్వరస్వామిని దర్శిస్తే అనేక జన్మల పుణ్య ఫలితం ఉంటుంది.

– కృష్ణశర్మ, ఆలయ పురోహితుడు

రెండు రోజులు మాత్రమే



నల్లమల అభయారణ్యంలో గుండ్ల బ్రహ్మేశ్వరం క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. ఇది పులుల సంరక్షణ కేంద్రం కావడంతో ఎవరినీ అనుమతించం. కేవలం మహాశివరాత్రి సందర్భంగా మాత్రమే ప్రకాశం, కర్నూలు జిల్లాల భక్తులను రెండు రోజులు మాత్రమే అనుమతిస్తాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– ఉదయ్‌దీప్, గుండ్ల బ్రహ్మేశ్వరం రేంజ్ ఆఫీసర్

బ్యాంకు వివరాలు అపరిచితులకు పంపొద్దు

- ఆన్‌లైన్ పెట్టుబడుల ఆఫర్లను నమ్మొద్దు
- జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య



అవగాహన కల్పిస్తున్న ఎన్ఐసీ డీఐఓ ప్రవీణ్‌రెడ్డి

కర్నూలు(అర్బన్): సెల్‌ఫోన్స్‌కు వచ్చే ఓటీపీని, ఆధార్, బ్యాంకు వివరాలను అపరిచిత వ్యక్తులకు షేర్ చేయకూడదని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య సూచించారు. సోమవారం సునయన ఆడిటోరియంలో సురక్షితమైన ఇంటర్‌నెట్ దినోత్సవం సందర్భంగా ఎన్ఐసీ డీఐఓ ఆధ్వర్యంలో పీపీటీ ద్వారా సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రీవెన్స్‌కు హాజరైన అధికారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తమ వివరాలను ఇతరులకు షేర్ చేయడం వల్ల సైబర్ నేరగాళ్లు మీ బ్యాంకు ఖాతాలోని నగదును అపహరించే అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం షేర్ చేసుకోవద్దని, అనధికార ఆధార్ చెల్లింపు నోటిఫికేషన్లపై జాగ్రత్త వహించాలన్నారు. కేవైసీ నవీకరణల పేరుతో పాన్, ఆధార్ లేదా బ్యాంకు వివరాలను అడిగే అనధికార సంఖ్యల నుంచి లింకులను ఎప్పుడు క్లిక్ చేయరాదని సూచించారు. అధిక రాబడులు కలిగిన ఆన్‌లైన్ పెట్టుబడుల ఆఫర్లను నమ్మవద్దని కోరారు. మొబైల్‌లోని యాప్‌లను క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, అవసరం లేని వాటిని తొలగించుకోవాలన్నారు. ఎటువంటి ప్రభుత్వ సంస్థలు (పోలీసు, సీబీఐ, ఈడీ) వీడి యో, వాయిస్ కాల్స్ ద్వారా ఎలాంటి దర్యాప్తు చేయవన్నారు. టెలికాం శాఖ, ట్రాయ్ నుంచి వచ్చిన వాయిస్ కాల్స్ ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోకండని జేసీ వివరించారు. ఎన్ఐసీ డీఐఓ ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ యుగంలో ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాలు, డేటా లీక్‌లు, హ్యాకింగ్ వంటి ముప్పులు తీవ్రమవుతున్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సైబర్ భద్రతపై అవగాహన కల్పించడం, సురక్షితమైన ఇంటర్నెట్ ప్రవర్తనను ప్రోత్సహించడం తమ ముఖ్య ఉద్దేశమన్నారు.

బంగారు వ్యాపారికి బెదిరింపులు



ఎస్ఐ తిమ్మయ్యకు ఫిర్యాదు చేస్తున్న బంగారు వ్యాపారి వెంకటేష్

కోడుమూరు రూరల్: డబ్బులివ్వాలని, లేకపోతే చంపుతామని కొందరు తనను బెదిరిస్తున్నారని గూడూరుకు చెందిన బంగారు వ్యాపారి దమామ్ వెంకటేష్ సోమవారం పోలీసులను ఆశ్రయించాడు. ఇతడిని 2024 జూన్‌లో గొల్ల వీరేష్ తన అనుచరులతో కిడ్నాప్ చేయించి డబ్బుల కోసం తీవ్రంగా హింసించాడు. ఆ సమయంలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కిడ్నాపర్ల చెరనుంచి వెంకటేష్‌ను రక్షించారు. తర్వాత ఆ కిడ్నాపర్లను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అయితే, బయటకు వచ్చిన తర్వాత కొంతకాలం పాటు సైలెంట్‌గా ఉన్న దుండగులు గత 15 రోజులుగా మళ్లీ డబ్బులివ్వాలని లేకపోతే చంపుతామంటూ బెదిరిస్తున్నారని, తనకు వారి నుంచి రక్షణ కల్పించాలని బాధితుడు వెంకటేష్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు ఎస్ఐ తిమ్మయ్య విలేకర్లకు తెలిపారు.

దళిత మహిళపై టీడీపీ నాయకుడి దౌర్జన్యం

- ఇంటి నిర్మాణం నిలిపేయకుంటే అంతు చూస్తానని హెచ్చరిక
- నంద్యాల ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు



నిర్మాణంలో ఉన్న ఇల్లు, పెసల తిరుపాలమ్మ

గడివేముల: టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారు. తాజాగా దళిత మహిళ ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అంతు చూస్తామని హెచ్చరికలు జారీ చేశారు. నంద్యాల జిల్లా గడివేముల మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దళితురాలు పెసల తిరుపాలమ్మకు 2012లో ఇంటి పట్టా మంజూరు కావడంతో అప్పుడు బేస్‌మట్టం వరకు ఇంటి నిర్మాణం చేసుకున్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేక ఇంటి నిర్మాణాన్ని నిలిపేశారు. అదే స్థలానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2021లో ఇంటి పట్టా మంజూరైంది. అప్పులు చేసి గత రెండు రోజుల నుంచి ఇంటి నిర్మాణం చేపట్టగా..ఆమె వైఎస్సార్‌సీపీకి మద్దతురాలు కావడంతో టీడీపీ నాయకుడు దౌర్జన్యం చేశాడు. ఇంటి నిర్మాణం చేపడుతున్న కార్మికులకు ఫోన్ చేశాడు. ఇంటి నిర్మాణాన్ని కూలుస్తామని బెదిరింపులకు గురిచేశాడు. పొలం, స్థలం లేకుండా చేస్తానని బెదిరించాడు. ఈ విషయమై బాధితురాలు నంద్యాల జిల్లా ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు.

గ్రామంలో చిచ్చు పెడుతున్నారు

కొరటమద్ది గ్రామానికి నేను మూడు సార్లు సర్పంచ్‌గా పనిచేశాను. గ్రామంలో ఎప్పుడు గొడవలు లేవు.కూటమి ప్రభు త్వ అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామంలో టీడీపీ నాయకులు చిచ్చురేపుతున్నారు. దళిత మహిళను బెదిరించడం మంచి పద్ధతి కాదు. టీడీపీ నాయకుడి బెదిరింపులకు కారణంగా గ్రామంలో పూజారి ఊరి విడిచి వెళ్లిన ఘ టన ఉంది. దీంతో ఆలయానికి తాళం వేయాల్సి వచ్చింది.

–కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్, కొరటమద్ది

కొత్త ఇళ్లు మంజూరు చేయలేదు

– కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గిరిజనుల



గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ, ఆర్‌డీఓ

శ్రీశైలం: పక్కా ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, కొత్త ఇళ్లు ఎవరికీ మంజూరు కాలేదని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌కు మేకలబండ గిరిజనులు ఫిర్యాదు చేశారు. మేకలబండలో గిరిజనులతో జిల్లా అధికారులు మాట్లాడారు. ముఖాముఖి సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ అందుతుందా లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

రుద్రవరం: మండల పరిధిలోని బి.నాగిరెడ్డిపల్లెకు చెందిన వృద్ధురాలు వెంకటలక్ష్మమ్మ (71) సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గోపాల్ భార్య వెంకటలక్ష్మమ్మ కొంత కాలంగా చెవి నొప్పితో బాధపడేది. వైద్యులకు చూపించగా ఆపరేషన్ చేయాలని చెప్పారు. భయపడిన ఆమె కలుపి మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన స్థానికులు నంద్యాల వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. కుమారుడు మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఆలూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి సోమవారం ఉదయం ఆలూరు ఆసుపత్రిలో కోలుకోలేక మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదివారం రాత్రి హైవే 167లో ఆలూరు సమీపంలోని 133 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని (50) స్కూటర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సోమవారం ఉదయం కోలుకోలేక మృతిచెందాడు. గుర్తు తెలియని వ్యక్తి కావడంతో మృతదేహాన్ని ఆలూరు ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచారు. బంధువులు వస్తే మృతదేహాన్ని అప్పగిస్తామని ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్ వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

కేజే రెడ్డిపై కేసు నమోదు

కర్నూలు: రియల్ ఎస్టేట్ వ్యాపారి కేజే రెడ్డిపై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రియల్ ఎస్టేట్ వ్యాపారి ముప్పా రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు. ఈనెల 8వ తేదీన తాను సంగమేశ్వరం దేవాలయంలో పూజలో ఉండగా కేజే రెడ్డి ఫోన్ చేశాడని, లిఫ్ట్ చేయనందుకు తన మనుషుల చేత బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అతనితో తనకు ఎలాంటి వ్యాపార లావాదేవీలు లేనప్పటికీ రూ.2 లక్షలు బాకీ ఉన్నట్లు, వాటిని చెల్లించని పక్షంలో తన డ్రైవర్ కుమార్‌ను కిడ్నాప్ చేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొనడంతో 329(4), 351(2), 308(2), రెడ్ విత్ 62, రెడ్ విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

50 కర్ణాటక హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లు సీజ్

ఆదోని రూరల్: కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప నుంచి ఏపీలోకి అక్రమంగా వాహనంలో తీసుకొస్తున్న హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లను సివిల్‌సప్లై అధికారులు పట్టుకున్నారు. స్థానిక గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ల ఫిర్యాదుతో నిఘా వేసి పట్టుకున్నట్లు ఆదోని సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ వలీబాషా తెలిపారు. మొత్తం 50 సిలిండర్లను, వాహనాన్ని సీజ్ చేసి ఇస్పీ పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించారు. దాడిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాశీ, వీఆర్వో బసవరాజు పాల్గొన్నారు.

భవితా.. మీ సారోళ్లొచ్చారు చూడూ!



భవిత మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, నానమ్మ, చిత్రంలో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థినులు



భవిత(ఫైల్)


భవితా లెవ్వమ్మా.. మీ సారోళ్లొచ్చారు.. మీ స్నేహితురాళ్లొచ్చారు.. ఒక్కసారి లేచి వాళ్లను చూడమ్మా అంటూ ఆ తల్లి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. తమతో నిన్నమొన్నటి వరకూ ఆడుతూ పాడుతూ గడిపిన స్నేహితురాలు విగతజీవిగా పడి ఉండటం చూసి తోటి విద్యార్థినులు కుమిలి కుమిలి ఏడ్చారు. ఈ ఘటన దొర్నిపాడు మండలం బుర్రారెడ్డి పల్లెలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కంబయ్య, కల్పన దంపతు కుమార్తె భవిత(14) స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతూ ఉండేది. వారం క్రితం అనారోగ్యానికి గురైంది. ఆళ్లగడ్డ, నంద్యాల, కర్నూలు వైద్యశాలల్లో దాదాపు రూ.3 లక్షల వరకు ఖర్చు చేసి వైద్యం చేయించినా ఫలితం దక్కలేదు. ఆదివారం రాత్రి మృతిచెందింది. విషయం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు గ్రామానికి చేరుకుని భవిత మృతదేహాన్ని చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ఉత్సాహంగా పాల్గొనే భవిత ఇంత చిన్న వయసులోనే అనంతలోకాలకు చేరుకుంటుందని అనుకోలేదని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల బృందం కలిసి విద్యార్థిని కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

– దొర్నిపాడు

15న మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లా స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 15న నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీధర్ తెలిపారు. సోమవారం నందిపైప్స్ ఇండోర్ స్టేడియంలో ఆయన మాట్లాడుతూ 35 నుంచి 65 ఏళ్ల వయస్సున్న క్రీడాకారులకు వయసుల వారీగా విభజించి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పురుషులకు, మహిళలకు సిగింల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్లను ఎంపిక చేస్తామన్నారు. ప్రతి విభాగంలో సింగిల్స్, విన్నర్స్, రన్నర్స్, డబుల్స్ విన్నర్స్ జట్లు ఈనెల 21న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మరింత సమాచారం కోసం 8985809434 సంప్రదించాలన్నారు.

రోడ్డుప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి



మేరి (ఫైల్)

బొమ్మలసత్రం: బొగ్గులైన్ సమీపంలోని రహదారిపై సోమవారం బైక్ – కారు ఢీకొన్న ఘటనలో ఉపాధ్యాయిని నాన్సి మేరి (58) అక్కడికక్కడే మృతిచెందింది. ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా తెలిపిన వివరాలు.. హనీఫ్ నగర్‌కు చెందిన నాన్సి మేరి, యేసురత్నం దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. శిరివెళ్ల మండలం ఎర్రగుంట్లలో నాన్సి మేరి సోషల్ టీచర్‌గా, మండల పరిషత్ పాఠశాలలో ఎమ్‌టీఎస్‌గా యేసురత్నం పనిచేస్తున్నారు. దంపతులు రైల్వే స్టేషన్ సమీపంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా బొగ్గులైన్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో నాన్సి మేరి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రగాయాలపాలైన యేసురత్నంను స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.